# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో 1950–1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# కథ పేరు: నలభై ఎనిమిది గంటల్లో
# { పేట్రిషియా మేక్ గెర్ కథకి స్వేచ్ఛానువాదం}

**జర్నలిస్ట్‌గా పనిచేసే సెలీనాకి** ఇజ్రాయిల్‌లోని కింగ్ డేవిడ్ హోటల్‌లో అమెరికన్ సెనెటర్ స్టెయిన్ తారసపడ్డాడు.

"సెలీనా! నువ్వు జెరూసలెంలో ఉన్నావని నాకు తెలీదు. మీ ఆయన కూడా వచ్చాడా?" ఆయన అరవై దాటిన ఆమె బుగ్గమీద ముద్దు పెట్టుకుని అడిగాడు.

"లేదు. నా పేపర్ నన్ను ఇక్కడికి ప్రైం మినిస్టర్ని, కొందరు కేబినెట్ మంత్రులని ఇంటర్వ్యూ చేయడానికి పంపింది. మీరు? సెలవలు గడపడానికా? లేక ప్రభుత్వ పని మీదా?"

"పూర్తిగా సరదాకే. రేచెల్‌కి, నాకు ప్రతీ పెన్నీ నా జేబులోంచే ఖర్చవుతోంది. నా గురించి రాయదలచుకుంటే, ప్రజల సుంకాలని దుర్వినియోగం చేయడం లేదని గుర్తుంచుకుని రాయి. నువ్వు ఇంకా ఎంతకాలం ఉంటున్నావు?"

"నేను రేపు వెళ్ళాలి. కాని నా సీట్ కన్ఫాం కాలేదనే సమాచారం ఇప్పుడే అందింది. కాబట్టి ఎల్లుండి దాకా ఇక్కడే ఉంటాను." సెలీనా చెప్పింది.

"ఐతే రేపు నువ్వు మాతో రావచ్చు. నెగెవ్, కుసారా, కుమ్రాన్ కేవ్‌లకి వెళ్ళడానికి నేను కారుని అద్దెకి తీసుకున్నాను."

"థాంక్స్. విమానంలో నాకు సీట్ దొరకనందుకు సంతోషంగా ఉంది" సెలీనా ఆనందంగా చెప్పింది.

మర్నాడు ఉదయం సెలీనా, రేచెల్ వెనక సీట్లో కూర్చుంటే, స్టెయిన్ కారు నడపసాగాడు. వారు జెరూసలెం నించి కిడ్రాన్ లోయ మీంచి జెరికో రోడ్డు మీదకి వెళ్ళడానికి పాత నగరం గోడలకి ప్రదక్షిణం చేసారు. గంటలోపే వారు ఆధునిక నాగరికతకి దూరమైపోయి డెడ్ సీ తీరానికి చేరుకున్నారు. రేచెల్ తన హేండ్‌బాగ్‌లోంచి ఓ రోడ్ మేప్‌ని, పర్యాటక గైడ్ పుస్తకాన్ని బయటకి తీసి వెళ్ళడానికి దారిని గుర్తుపెట్టి భర్తకి ఇచ్చింది. అక్కడంతా కొండలు, తక్కువగా ఉన్న చెట్లు, అక్కడక్కడా ఎడారిలో ఇజ్రాయిల్ వాళ్ళు పండించే టమోటాలు, వంకాయలు లాంటి తోటలు, ఈతచెట్లు కనిపించాయి.

డెడ్ సీ స్క్రోల్స్ కనిపెట్టబడ్డ కుమ్రాన్ గుహలని సమీపించాక స్టెయిన్ కారు వేగాన్ని తగ్గించి చెప్పాడు.

"తిరిగి వచ్చేప్పుడు ఆగుదాం."

ఎదురుగా కొద్ది దూరంలో చరిత్ర ప్రకారం మోసెస్‌ని ఖననం చేసిన మాబ్ కొండలని చూసారు. దారిలో కనపడ్డ తుప్పుపట్టిన టేంక్‌లు 1967 యుద్ధాన్ని గుర్తు చేసాయి. వాళ్ళు ఇజ్రాయిల్ సైనికుల చెక్ పాయింట్‌ని దాటి, వెస్ట్ బేంక్ నించి

జోర్డాన్‌లోకి వెళ్ళారు. గొర్రె చర్మంతో చేసిన మూడు గుడారాల్లోని ఆడవాళ్ళని, పిల్లలని, ఓ గొర్రెల మందని చూసి స్టెయిన్ కారు వేగాన్ని తగ్గించాడు.

సెలీనా మొదటిసారి తమ వెనక వచ్చే దుమ్ముకొట్టుకుపోయిన ఫియెట్ కారుని అక్కడ గమనించింది. జెరూసలెం నించి బయలుదేరాక చాలా బస్‌లు తప్ప ప్రైవేట్ కార్లు కనపడలేదు. స్టెయిన్ కారుని అక్కడక్కడా టూరిస్ట్ స్పాట్ల దగ్గర ఫోటోల కోసం ఆపినప్పుడు సెలీనా ఆ కారు తమని దాటి వెళ్తుందని ఎదురు చూసింది. కాని దాని వేగం కూడా తగ్గి, సెనెటర్ కారు వేగాన్ని పెంచాక దాని వేగం కూడా పెరగసాగింది.

తమని ఆ కారులోని వారు అనుసరిస్తున్నారా అనే అనుమానం ఆమెకి కలిగింది. కాని భర్త గూఢచారి సంస్థలో పనిచేస్తే కలిగేలాంటి ఆలోచనలు అవి అనుకుని వాటిని కొట్టి పారేసింది. ఆ కార్లోనివాళ్ళు కూడా తమలాగే పర్యాటకులు కాబట్టి తాము ఆగిన చోటే వారూ ఆగి చూసి తిరిగి కొనసాగుతూండి ఉండచ్చు అనుకుంది.

కొన్ని కిలోమీటర్ల తర్వాత వారి కారు హై వే నించి హెరాడ్ పురాతన కోట ఉన్న మసాదా వైపు చిన్న సన్నటి రోడ్లోకి తిరిగింది.

"తిరిగి వెళ్ళేప్పుడు పెట్రోల్ కొట్టించుకోవాలి. గుర్తుంచుకోండి" స్టెయిన్ కారుని కోట పార్కింగ్ స్పేస్‌లో ఆపాక చెప్పాడు.

సువెనీర్ షాపుల మీంచి వాళ్ళు ముగ్గురూ కేబు కారు దగ్గరకి నడిచారు. ఓ పర్యాటక బృందంతో కలిసి ఎర్రటి పెద్ద కేబుల్ కార్లోకి ఎక్కి కొండ మీదకి చేరుకున్నారు. కేబుల్ కార్లోంచి చూస్తే పాములా మెలికలు తిరిగిన స్నేక్ పాత్ మీద నడిచి ఎక్కే పర్యాటకులు కనిపించారు. సెకీనాకి సెనెటర్ కారు పక్కన ఆ ఫియట్ కారు ఆగడం కనిపించింది. వాళ్ళు కూడా తమలాగా మసాదాని చూడటానికి వచ్చిన పర్యాటకులు అనుకుంది. అక్కడనించి కొండ శిఖరం మీదకి మెట్లెక్కి వెళ్ళారు. ఆ రోజుల్లో ఆహారం, వైన్ నిలవ చేసిన గదులని చూసారు. బయట ఉన్న బెంచీలని చూసి స్టెయిన్ కూర్చున్నాడు.

"ఈ కాస్త నడకకే మీకు అలసట వచ్చింది" రేచెల్ చెప్పింది.

ముగ్గురూ కూర్చున్నాక రేచెల్ గైడ్ బుక్‌ని తీసి పంతొమ్మిదివందల ఏళ్ళ క్రితం జరిగిన మసాదా కథని వాళ్ళకి చదివి వినిపించింది. రేచెల్ కాసేపాగి చెప్పింది.

"నీ అభిమాని అక్కడ నిలబడి నీవంకే చూస్తున్నాడు."

పసుపు పచ్చ టీ షర్ట్‌లోని ఒకతను తమవైపు చూస్తూ సెలీనాకి కనపడ్డాడు.

"మనం సెనెగాగ్‌లోకి వచ్చినప్పటినించి అతన్ని గమనిస్తున్నాను. మనల్ని అనుసరిస్తున్నాడు."

"మీ ఇద్దరిలో వాడు ఎవర్ని చూస్తున్నా వాడిది చక్కటి అభిరుచి అని చెప్పగలను" స్టెయిన్ నవ్వుతూ చెప్పాడు.

కొండని దిగి కింద ఉన్న ఓ రెస్టరెంట్‌లో లంచ్ చేసారు. తర్వాత తమ కారు దగ్గరకి వెళ్తూంటే బస్ దిగిన అమెరికన్ పర్యాటక బృందంలోని ఒకరు వాళ్ళ దగ్గరకి వచ్చి అడిగారు.

"మీరు సెనెటర్ స్టెయిన్ కదా? క్రితం సంవత్సరం మీరు మా కాలేజీలో మాట్లాడారు."

ఆయన అతనితో మాట్లాడుతూంటే ఆడవాళ్ళు ఇద్దరూ ముందుకి నడిచారు.

"ఈ ట్రిప్‌లో మావారు త్వరగా అలసిపోవడం గమనించాను. ఇప్పటికే ఆయనకి ఓసారి హార్ట్ ఎటాక్ వచ్చింది. సరైన భోజనం, సరైన నిద్ర ఉంటే ఆయనకి ఏం కాదని డాక్టర్ చెప్పాడు. కొద్ది వారాల్లో ఆయనకి డెబ్బై నిండుతుంది. ఐనా కష్టపడి పనిచేస్తారు. ఈ టర్మ్ ముగిసాక తర్వాతి టర్మ్ కి పోటీ చేయరు" రేచల్ చెప్పింది.

వారు కారు దగ్గర అతని రాకకోసం వేచి ఉన్నారు. ఆయన ఆ అమెరికన్ పర్యాటకుడి దగ్గర శెలవు తీసుకుని కారు వైపు నడుస్తూంటే ఇద్దరు యువకులు ఆయన వెనకనించి వచ్చారు. వారిలో ఒకరు పసుపుపచ్చ రంగు షర్ట్ అతను. వాళ్ళు ఆయనకి రెండు వైపులా ఆనుకుని నడవడం చూసిన రేచెల్ ఆదుర్దాగా చెప్పింది.

"ఏదో అపశృతి జరుగుతోంది అని మా వారి మొహం చూస్తే అనిపిస్తోంది."

"అంతా కార్లోకి ఎక్కండి నా వీపుకి రివాల్వర్  గురిపెట్టబడి ఉంది" స్టెయిన్ ఆడవాళ్ళకి చెప్పాడు.

"ఎదురు తిరగకపోతే ఎవరికీ ఏ బాధా ఉండదు" ఒకడు చెప్పాడు.

"మీరు ఎవరు? మా వారిని ఏం చేస్తున్నారు?" రేచెల్ భయంగా అడిగింది.

సెలీనా చుట్టూ చూసింది. పర్యాటకుల బస్ వెళ్ళిపోయింది. చుట్టూ ఎవరూ లేరు.

"మందు. నా మందు" స్టెయిన్ గుండె పట్టుకుని అరిచాడు.

వెంటనే రేచెల్ తన హేండ్‌బేగ్ తెరిచి అందులోంచి మందుడబ్బా తీసి ఓ మాత్రని భర్త నాలుక కింద ఉంచింది. కొద్దిసేపటికి ఆయన మొహంలోంచి పోయిన రంగు తిరిగి వచ్చింది.

"మీరు డబ్బు కోసమైతే మా దగ్గర ఇరవైడాలర్లు మించి లేవు" రేచల్ చెప్పింది.

"మేం దొంగలం కాము. పాలస్తీనా దేశభక్తులం .ఈయంతో మాకు పని ఉంది. ఇతను రహీం. నా పేరు అబ్దుల్" పసుపుపచ్చ రంగు చొక్కా వాడు చెప్పాడు.

"ఐతే నన్ను తీసుకెళ్ళి ఆడవాళ్ళని వదిలేయండి" స్టెయిన్ బలహీనంగా చెప్పాడు.

"లేదు స్టెయిన్. నేను నిన్ను వదిలి వెళ్ళను. మా ఫ్రెండ్‌ని విడిచిపెట్టండి" రేచెల్ ఆదుర్దాగా చెప్పింది.

"ఎవర్ని వదిలినా పోలీసులకి ఫిర్యాదు చేసి తీరుతారు. అంతా కారు ఎక్కండి. మీరు సరిగ్గా ప్రవర్తిస్తే మిమ్మల్ని యుద్ధఖైదీల్లా చూస్తాం. అంతా మేం అనుకున్నట్లు జరిగితే మీరు త్వరలో ఇళ్ళకి వెళ్ళచ్చు" అబ్దుల్ చెప్పాడు.

సెలీనా డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాక కారు బయలుదేరింది. హైవే మీదకి వెళ్ళాక తన పక్కన కుర్చున్న అబ్దుల్ సౌంజ్ఞని అనుసరించి సెలీనా కారుని కూడివైపు తిప్పింది. కొద్ది దూరం వెళ్ళాక టూరిస్ట్ బస్ జెరూసలెం వెళ్ళే రోడ్లోకి తిరగడం రియర్ వ్యూ మిర్రర్‌లోంచి చూసింది. ఆయిల్ గేజ్‌ని  చూసి, చాలా దూరం వెళ్ళాల్సివస్తే పెట్రోల్ కొట్టించాల్సిన అవసరం ఉందని అనుకుంది .పెట్రోల్ బంక్ లో కారు ఆగినప్పుడు తమ కిడ్నాప్ గురించిన సమాచారాన్ని ఎవరికైనా ఎలా ఇవ్వాలి? అని ఆలోచించసాగింది. బాత్‌రూంని ఉపయోగించాలని చెప్పి, అక్కడ కాగితం మీద రాసి ఉంచాలి అనుకుంది. ఎడారిలో పెట్రోల్ కార్లలో తిరిగే వాళ్ళు తక్కువ. ఆ ఉద్యోగి పాలస్తీనా సానుభూతి పరుడైతే?

కొన్ని మైళ్ళు వెళ్ళాక అబ్దుల్ సన్నటి మట్టి రోడ్‌లోకి కారుని తిప్పించాడు. ఎదురుగా ఇంకో కారు వస్తే తమ కారుని పక్కన దుబ్బల్లోకి పోనివ్వాలి. కాని ఇంకో కారు ఎదురుపడలేదు. పెట్రోల్ అయిపోతోందని చెప్పదలచుకోలేదు. అది వాళ్ళకి అసౌకర్యం, తమకి ప్రయోజనం అనుకుంది. పది నిమిషాల తర్వాత రోడ్‌కి కుడివైపు గొర్రె చర్మాల టెంట్లు రెండు కనిపించాయి. ఓదాని బయట అరబ్ డ్రస్‌లోని ఓ వ్యక్తి నిలబడి ఉన్నాడు. అబ్దుల్ వాటి పక్కన కారుని ఆపించాడు. తాము రెండు – మూడు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించామని సెలీనా అనుకుంది.

"ఓ! మనకీ అనుకోని అతిథి కూడా ఉందన్నమాట. ఐనా ఫర్వాలేదు" కారు దిగిన వాళ్ళని చూసాక ఆ కొత్త వ్యక్తి చెప్పాడు.

"మీరు ఎవరు? మమ్మల్ని ఇక్కడికి ఎందుకు తీసుకు వచ్చారు?" స్టెయిన్ అడిగాడు.

"నా పేరు హసన్. ముగ్గురు అమెరికన్ పౌరులని కిడ్నాప్ చేయడం వల్ల మాకు ప్రయోజనం. మీకు అమెరికాలో దొరికే సౌకర్యాలు ఈ ఎడారిలో ఇవ్వలేం. ఇజ్రాయిల్ ప్రభుత్వం మా డిమాండ్స్‌ని తీర్చేదాకా మీరు మా బందీలు."

"మీరు ఉగ్రవాదులు అన్నమాట?"

"కాదు. స్వతంత్ర పోరాటం చేసే తిరుగుబాటుదారులం."

అబ్దుల్ ఆ కారుని చిన్న కొండలోంచి పొడుచుకు వచ్చిన రాతి కప్పు కిందకి తీసుకెళ్ళి పార్క్ చేసాడు.

"రహీం. మన మిత్రులకి మొదటి మెట్టు విజయం అని చెప్పు."

రహీం టెంట్‌లోకి వెళ్తూంటే వారి దగ్గర వైర్‌లెస్ ఉందని సెలీనా భావించింది. దాన్ని ఉపయోగించే అవకాశం వస్తే ఎస్ ఓ ఎస్‌ని పంపచ్చని అనుకుంది. కాని ఎవరికి? అది రహీం మాట్లాడే పాలస్తీనా కమాండ్ పోస్ట్‌కే పరిమితమేమో? ప్రపంచానికి తమగురించి తెలియచేయడానికి ఇంకేమైనా దారి ఉందా అని ఆలోచించసాగింది.

ఇజ్రాయిల్‌కి వాషింగ్టన్ డిసికి మధ్య కాలంలో ఏడు గంటల తేడా ఉంది. అమెరికన్ సెనెటర్ స్టెయిన్, అతని భార్య కిడ్నాప్ అయ్యారని తెలిసేసరికి వాషింగ్టన్ డిసిలో ఇంకా తెల్లారుఝామే. తొమ్మిదిమంది ఇజ్రాయిలీలని బాంబింగ్‌లో

చంపిన పాలస్తీనా ఉగ్రవాదులని ఇజ్రాయిల్ విడిచిపెడితేనే వాళ్ళని విడిచిపెడతామనే ఉగ్రవాదుల డిమాండ్ వాషింగ్టన్‌కి చేరింది. ఆ సమాచారం రొటీన్‌గా అన్ని అమెరికన్ గూఢచారి సంస్థలకి కూడా చేరింది.

సెక్షన్ క్యు అనే చిన్న దళానికి అధిపతైన హగ్ పియర్స్‌కి కూడా అది తెలిసింది. అయితే తన భార్య సెలీనా కూడా ఆ బందీల్లో ఒకరు అని అప్పుడు అతనికి తెలీదు. ఆమె విమానాశ్రయంలో ఉందని అతను అనుకుంటున్నాడు. మొదట ఇజ్రాయిల్‌లోని అమెరికన్ ఎంబసీ అది ఉత్తుత్తి బెదిరింపు అనుకుంది. కాని కింగ్ డేవిడ్ హోటల్‌లో విచారించాక సెనెటర్ తన భార్యతో డెడ్ సీ ప్రాంతానికి టూర్‌కి వెళ్ళాడని తెలిసింది. టూర్లని కండక్ట్ చేసేవాళ్ళని ప్రశ్నిస్తే, కిడ్నాప్‌కి కొద్ది నిమిషాల ముందే ఓ అమెరికన్ పర్యాటకుడు సెనెటర్‌తో మాట్లాడిన సంగతి తెలిసింది. సెనెటర్ ఐటనరీ ప్రకారం ఇంకా హోటల్‌కి తిరిగి రాకపోవడం వల్ల అది నిజం అని బలపడసాగింది. ఇజ్రాయిలీ గూఢచారి సంస్థ వారు మసాదాకి వెళ్ళి వచ్చిన పర్యాటకుల్ని ప్రశ్నిస్తే స్టెయిన్ కారు జెరూసలెం వైపు కాక ముందుకి సాగిందని తెలిసింది. ఓ మహిళ దాన్ని డ్రైవ్ చేస్తోందని, వెనక ముగ్గురు, ముందు ఇద్దరు ఉన్నారని, వారిలో ముగ్గురు మగాళ్ళని కూడా తెలిసింది. ఆ కారుని అద్దెకి ఇచ్చిన కంపెనీ తాము డ్రైవర్ని ఇవ్వలేదని, స్టెయిన్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాడని చెప్పింది.

ఈ సమాచారం కూడా అందగానే ఆ రెండో మహిళ తన భార్య అనే అనుమానం హగ్‌కి కలిగింది. సెనెటర్ దంపతులకి సెలీనాకి పరిచయం ఉందని అతనికి తెలుసు. వెంటనే కింగ్ డేవిడ్ హోటల్‌కి ఫోన్ చేసి ఆమె ఇంకా తిరిగి రాలేదని తెలుసుకున్నాడు. సెలీనా ఎక్కాల్సిన విమానం కంపెనీకి ఫోన్ చేస్తే ఆమె సీట్ కన్‌ఫం కాలేదు కాబట్టి ఆమె విమానంలో లేదని అతనికి తెలిసింది. అంటే ఉగ్రవాదుల చేతుల్లో, ఇజ్రాయిల్‌లోనే ఉందా?

❦❦❦

రాత్రి ఎడారి చలిని తట్టుకోడానికి హసన్ ఆ ముగ్గురు బందీలకి చలిని ఆపే దుస్తులని ఇచ్చాడు. ఆ రోడ్ ఒకప్పుడు పురావస్తు పరిశోధన వారు తవ్వకాల కోసం నిర్మించారు. ప్రస్తుతం తవ్వకాలు ఆగిపోవడంతో అందులోకి రావాల్సిన అవసరం ఎవరికీ ఉండదు. అబ్దుల్ గుడారం బయట చలి మంటని రాజేసాదు. ఇజ్రాయిల్ విమానం తక్కువ ఎత్తులో ఎగిరినా అవి ఎడారిలోని వందల బౌడినీ గుడారాల్లోనే గుడారాలే అనుకుంటారు.

"రెండు రోజులకి సరిపడే నీళ్ళు, ఆహారమే మన దగ్గర ఉన్నాయి. కాబట్టి అనుకోని అతిథి వల్ల మీరు సగం కడుపుకే తినాలి" అన్నం సలాడ్‌లని ఇచ్చి హసన్ చెప్పాడు.

"రెండు రోజుల తర్వాత సంగతి?" సెలీనా అడిగింది.

"వాళ్ళని విడిపించడానికి ఇచ్చిన సమయం నలభై ఎనిమిది గంటలే. ఆ తర్వాత ఏం చేయాలన్న సూచన అప్పుడు వస్తుంది."

ఆ తర్వాత తమని ఏం చేస్తారో ముగ్గురికీ అర్ధమైంది. ఆ ముగ్గురిలో ఎవరికీ ఆకలి లేకపోవడంలో ఆశ్చర్యంలేదు.

"నేను కార్లో పడుకుంటాను" రెండు గుడారాల్లో చోటు సరిపోదని గ్రహించిన సెలీనా చెప్పింది.

"ఆడవాళ్ళు ఇద్దర్నీ కార్లో పడుకోనివ్వండి. గాలినించి రక్షణతో పాటు లోపల కుషన్ ఉండటంతో చలి తెలీదు" స్టెయిన్ చెప్పాడు.

"కాని నేను మీతోనే ఉంటాను" వెంటనే రేచెల్ నిరాకరిస్తూ చెప్పింది.

ఆడవాళ్ళు కార్లో పడుకోవడమే మంచిది" అబ్దుల్ చెప్పాడు.

తన భర్తని వదిలి రేచెల్ పారిపోదని అతనికి తెలుసు. సెలీనా ఆ కార్లోంచి రాత్రి పారిపోకుండా రెండు అడ్డంకులు ఉన్నాయి. మొదటిది కారు తాళం చెవి లేకపోవడం. రెండోది కారు వెనక చక్రాల కింద పేరుకున్న ఇసకని తొలగించడానికి పరికరాలు లేవు. చలిలో, చీకట్లో, చేత్తో అది అసాధ్యం అని ఆమె గ్రహించింది.

వెనక సీట్లో రేచెల్, ముందు సీట్లో సెలీనా పడుకున్నారు. రాత్రి పదికి సెలీనా కార్ రేడియోని ఆన్ చేసింది. ఇంగ్లీష్ వార్తల్లో ఇజ్రాయిల్ కేబినెట్, సెనెటర్ కిడ్నాప్ మీద ఎమర్జన్సీ మీటింగ్‌ని ఏర్పాటు చేసుకుందని, అమెరికన్ సెనెటర్‌ని, ఆయన భార్యని, గుర్తు తెలీని ఓ మహిళని పాలస్తీనా ఉగ్రవాదులు కిడ్నాప్ చేసారని చెప్పారు.

"సారీ! మా వల్ల నువ్వూ ఇరుక్కున్నావు" రేచెల్ చెప్పింది.

"అదీ మన మంచికే. కలిసి ఇరుక్కున్నాం కాబట్టి కలిసి పారిపోయే ప్రయత్నం చేయాలి" సెలీనా చెప్పింది.

నిద్రపోయే ముందు రేచెల్ అలవాటుగా బైబిల్‌లోని కీర్తనలని చదివింది.

మర్నాడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా బ్రెడ్‌ని, ఎండు చేపలని ఇచ్చారు. ఆడవాళ్ళిద్దరికీ బురఖాలని తొడిగించడంతో అది చూడటానికి స్థానిక జాతి కేంప్‌లా కనిపిస్తోంది. అలాంటి గుడారాలు చుట్టుపక్కల వందలు ఉండటంతో ఇది ఉగ్రవాదులది అని ఎవరూ పోల్చుకోలేరు.

మధ్యాహ్నం హసన్ వైర్‌లెస్ టెంట్‌లోంచి వచ్చి చెప్పాడు.

"ఇజ్రాయిలీ ప్రభుత్వం వీళ్ళు మన దగ్గర బందీలుగా ఉన్నారని, అది జీవించి ఉన్నారనే ఋజువుని అడుగుతున్నారు."

"అంటే ఆ ఋజువు లభిస్తే ఓ నిర్ణయం తీసుకుంటామని పరోక్షంగా చెప్తున్నట్లే. లేదా ఇది కూడా అడిగేవాళ్ళు కాదు. అంతా సక్రమంగా జరిగితే రాత్రికి ఆ ఐదుగురు ఖైదీలు డమాస్కస్‌కి చేరుకుంటారు. సెనెటర్! మీరు వైర్‌లెస్‌లో మాట్లాడండి. మీ గొంతుని వాళ్ళు గుర్తుపడతారు. మీరు, ఇద్దరు ఆడవాళ్ళు మాకు బందీలని, మీరు కులాసాగా ఉన్నారని, మేము మిమ్మల్ని చక్కగా చూసుకుంటున్నామని, మా డిమాండ్స్‌ని తీర్చకపోతే మిమ్మల్ని మళ్ళీ ప్రాణాలతో చూడలేరని మాత్రమే చెప్పాలి" రహీం కోరాడు.

"నేను వైర్‌లెస్‌లో ఎందుకు మాట్లాడుతాను? నేను మీ మద్దతుదారుని కాను. పైగా ఇజ్రాయిలీలు బ్లాక్ మెయిల్‌కి లొంగరు. ఇంతదాకా లొంగలేదు కూడా" స్టెయిన్ నిరాకరించాడు.

"మీరు మీ ప్రాణాలకి మద్దతుదారులని కూడా అనుకోకపోతే సరే. ఇందులో బలవంతం లేదు" హసన్ కఠినంగా చెప్పాడు.

"ఆ పాలస్తీనియన్స్ హంతకులు. వాళ్ళని విడుదల చేస్తే మరికొన్ని అమాయక ప్రాణాలని బలి తీసుకుంటారు. మరిన్ని కిడ్నాప్‌లు జరుపుతారు.

"మీరు ఇజ్రాయిల్ కోసం ప్రాణ త్యాగం చేయచ్చు కాని మీ భార్య, మీ మిత్రురాలి ప్రాణాలని బలి పెట్టే హక్కు మీకు లేదు. మీ ఇద్దరూ ఈ మూర్ఖుడితో మాట్లాడి ఒప్పించి మీ ప్రాణాలు కాపాడుకోండి" చెప్పి అబ్దుల్ బయటకి వెళ్ళిపోయాడు.

కొద్దిసేపటికి అబ్దుల్ వచ్చి అడిగాడు.

"ఏం నిర్ణయించారు?"

"ఇంతదాకా ఇజ్రాయిలీలు ఎన్నడూ ఉగ్రవాదులకి లొంగలేదు. మార్పులేదు" సెలీనా చెప్పింది.

"దానికి మా మద్ధతు కూడా ఉంది" రేచెల్ చెప్పింది.

"అది ఆత్మహత్యకి సిద్ధపడటమే"

"అది గౌరవనీయమైన మరణం" స్టెయిన్ చెప్పాడు.

మధ్యాహ్న భోజనం అన్నం, గొర్రె మాంసం కూర. ఆ సమయంలో రేడియోలోని వార్తలని విన్నారు.

'మూడో బందీ భర్త హగ్ తన భార్య విడుదల కోసం అమెరికానించి జెరూసలెం వచ్చాడు.' అది వినగానే సెలీనా సంతోషపడింది.

హగ్ వచ్చాడా? తనకి ఎంతో దగ్గరగా ఉన్నాడని అనిపించింది.

"భోజనానంతరం నేను బైబిల్ చదవచ్చా?" సెలీనా అడిగింది.

రేచల్ తన హేండ్‌బేగ్‌లోంచి దాన్ని తీసిచ్చింది. కొద్దిసేపు చదివాక అబ్దుల్‌తో చెప్పింది.

"నాకో ఆలోచన కలిగింది. సెనెటర్ దంపతులు మీకు సహాయం చేయరు. కాబట్టి నేను వైర్‌లెస్‌లో మీరు చెప్పమన్నది చెప్తాను."

"మనుషుల్ని ఒప్పించే విధానాలు ఉన్నాయి. ఆయన భార్యని.."

"అది పిచ్చి పని. ఆయనకి క్రితం నెలే హార్ట్ అటాక్ వచ్చింది. విశ్రాంతి కోసమే ఈ ట్రిప్‌కి వచ్చారు. ఎలాంటి మానసిక ఆందోళన కలిగినా మళ్ళీ ఆయనకి ఎటాక్ రావచ్చు. నేను జర్నలిస్ట్‌ని. అంటే సమాజంలో ముఖ్యమైనదాన్ని."

"అది మాకు తెలుసు. మాకు పై నించి సూచనలు రావాలి. ఐనా నువ్వు జీవించి తర్వాత ఈ అనుభవం రాయాలనుకుంటే అది అసంభవం అనిపిస్తోంది" హసన్ చెప్పాడు.

"తెలివిగా ఆలోచించండి. ఆయన చావడానికి కూడా సిద్ధంగా ఉండి మాట్లాడటంలేదని, వాళ్ళిద్దరూ క్షేమంగా ఉన్నారని చెప్తాను. వాళ్ళని చంపి మీరు నన్ను వదలడం వల్ల ప్రయోజనం ఏమిటి?"

హసన్ వైర్‌లెస్ గుడారంలోకి వెళ్ళి తిరిగి వచ్చాక చెప్పాడు.

"అందరికీ సెనెటర్ కంఠం తెలుసు కాని నీ కంఠం తెలీదు. కాబట్టీ మాలోని ఎవరో మాట్లాడుతున్నారని అనుకోవచ్చు."

"మీ పై వాళ్ళు ఎంత తెలివిహీనులు. నా పాస్‌పోర్ట్ నంబర్ చెప్తాను. అధికరులు దాన్ని చెక్ చేస్తే నేను అమెరికానించి జెరూసలెం వచ్చాదని ఇందాక విన్నాంగా? అది నా కంఠం కాదని అబద్ధం ఆడాల్సిన అవసరం ఆయనకి లేదు. ఇంకెవరైనా మిమిక్రీ చేసారనే అనుమానం కూడా కొట్టేయచ్చు. నేను నిత్యం నిద్ర లేవగానే నా భర్తకి బైబిల్‌లోని ఓ కీర్తనని చెప్తాను. పడుకోబోయే ముందు ఆయన నాకోటి చెప్తాడు. మీరు చెప్పమన్నది చెప్పాక నేనో కీర్తనని చెప్తాను. ఇది కొత్తవాళ్ళకి తెలిసే అవకాశం లేదు."

అతను మళ్ళీ వైర్‌లెస్ గుడారంలోకి వెళ్ళి వచ్చాడు. ఈసారి తిరిగి రావడానికి ఎక్కువ టైం తీసుకున్నాడు.

"ఏమన్నారు?" సెలీనా అడిగింది.

"సరే అన్నారు. నేను రాసిచ్చింది వైర్‌లెస్‌లో చదువు. దాన్ని వారు రికార్డ్ చేసి జెరూసలెంలోని దినపత్రికలకి పంపుతారు."

ఆమెని తన వెంట రెండో గుడారంలోకి తీసుకెళ్ళాడు. అతను రాసిచ్చింది చదివింది.

"సెలీనా! నువ్వు వాళ్ళ డిమాండ్స్‌కి తల ఒగ్గడం నాకు నచ్చలేదు. ఆ దుర్మార్గులని విడిపించడం వల్ల కలిగే నష్టానికి నువ్వే బాధ్యురాలివి" ఆమె వచ్చాక స్టైయిన్ కోపంగా చెప్పాడు.

"మీకు ఇంత వత్తిడి మంచిది కాదు. మీ గుండెలో ఏం జరుగుతోందో అని నేను భయపడుతున్నాను" రేచెల్ చెప్పింది.

జెరూసలెంలోని ఎలీట్ కమాండో యూనిట్‌లోని వారంతా తయారుగా ఉన్నారు. వారు సముద్రంలో, ఆకాశంలో, భూమి మీద ఉగ్రవాదులనించి ఎవర్నైనా కాపాడే విద్యలో శిక్షణ పొందినవారు. వారు ఇళ్ళు, ఆఫీసులు, హోటల్స్, సినిమా హాళ్ళు, స్కూళ్ళులాంటి పైన కప్పుగల చిన్న ప్రదేశాల్లోకి కూడా సమర్ధవంతంగా చొరబడగలరు. నేపథ్యంలో వినిపించే శబ్దాలని బట్టీ వారున్న స్థానం తెలుస్తుందని కమాండర్ సెలీనా టేప్‌ని పదే పదే విన్నా నిరుపయోగమైంది. చివర్లో ఆమె చెప్పిన ఆ కీర్తనని విన్నాడు.

'హగ్. గుడ్ మార్నింగ్. నిత్యం నిద్రలేవగానే నీకు చెప్పే కీర్తనని విను. ది లార్డ్ ఈజ్ ఇన్ హిజ్ హోలీ టెంపుల్. హిజ్ త్రోన్ ఈజ్ ఇన్ హెవెన్. హిస్ ఐ బిహోల్డ్ ది చిల్డ్రన్ ఆఫ్ హెవెన్. ప్రతీ రాత్రిలా ఈ రాత్రి నువ్వు చెప్పే కీర్తన కోసం ఎదురు చూస్తూంటాను.

వెంటనే హగ్‌ని పిలిపించి ఆ టేప్‌ని వినిపించారు.

"ఇప్పుడు నాకు కావాల్సిందల్లా ఓ రేబై (యూదు మతాచార్యుడు)" కొన్ని క్షణాలు ఆలోచించి హగ్ చెప్పాడు.

"ఏం? దైవ ప్రార్ధన చేయడం తప్ప మనకి ఇంకేం మిగిలి లేదా?" కమాండర్ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

రేబై వచ్చి వెళ్ళాక హగ్ గోడకి ఉన్న మేప్‌ని పరిశీలించి చెప్పాడు.

"ఆఖరిసారి హైవేలో వారిని చూసింది ఇక్కడ. వాళ్ళు దక్షిణం వైపు వెళ్ళారు. ఈ మార్గంలో మనం పదకొండు కిలోమీటర్లు దాటాలి. పన్నెండో కిలోమీటర్ దాటకూడదు."

ఆ దూరాన్ని మేప్‌లో కొలిచి చెప్పాడు.

"ఇక్కడ వాళ్ళు ఎడమవైపో, కుడి వైపో తిరిగి ఉంటారు."

"ఎడమవైపు తిరిగితే వాళ్ళు సముద్రపు ఒడ్డుకి చేరుకుంటారు. అక్కడ హోటల్స్ కూడా లేవు" కమాండర్ చెప్పాడు.

"కుడివైపు?" హగ్ అడిగాడు.

"కుడివైపు ఎడారి తప్ప ఇంకేం లేదు."

"మంచిది. ఇక్కడ నించి కుడివైపు రోడ్లో నాలుగు – ఐదు కిలోమీటర్ల దూరంలోని ఓ చదరపు కిలోమీటర్లో ఎక్కడో వారు ఉన్నారు."

"ఐతే విమానాన్ని పంపి.."

అది మంచిది కాదు. వాళ్ళని భయపెడితే అక్కడనించి వెళ్ళిపోవచ్చు. రొటీన్ డిజర్ట్ సెర్చ్ పెట్రోల్ వాళ్ళైతే వాళ్ళు భయపడరు. నేను సెలీనాకి చెప్పే కీర్తనని రేడియోలో అరగంటకోసారి ప్రసారంచేయించండి" హగ్ చెప్పాడు.

"ఉగ్రవాదులకి కూడా ఇంగ్లీష్ వచ్చని మీరు మర్చిపోకూడదు."

"నేను గూఢచారి అని కూడా మీరు మర్చిపోకూడదు" హగ్ చెప్పాడు.

హెడ్‌క్వార్టర్స్‌లోని తాజాగా తీసిన శాటిలైట్ ఫోటోలని పరిశీలించి కమాండో చెప్పాడు.

"ఇక్కడ బెడోయన్ తెగల గుడారాలు చాలా ఉన్నాయి. వాటిలో ఈ రెండూ కొత్తగా వెలిసాయి" రెండు గుడారాల చుట్టూ ఎర్ర రంగుతో గుండ్రం గీసి చెప్పాడు.

"మెరిసే ఆ లోహం కారై ఉండచ్చమో?" హగ్ చెప్పాడు.

"ఈ ఫోటోల్లో ఆరుగురు ఉన్నారు. మనవాళ్ళు ముగ్గురు, ఉగ్రవాదులు ముగ్గురు. ఇప్పుడు మనం ప్లాన్ బికి సిద్ధం అవాలి."

🦋🦋🦋

అప్పటికే వాళ్ళు పెట్టిన గడువులో ముప్పై రెండు గంటలు గడిచిపోయాయి. రాత్రి పదికల్లా ఆడవాళ్ళు ఇద్దరూ కార్లో పడుకున్నారు. క్రితం రాత్రిలా గుడారం బయట రాజేసిన  చలిమంట కనిపించింది. అది రాజేయకపోతే అనుమానం వస్తుందని, తమది బెడోయిన్ తండా అని అంతా భావించాలని ఉగ్రవాదులు దాన్ని రాజేసారని సెలీనా అనుకుంది.

చీకటి పడేదాకా దాడి జరగదని ఆమెకి తెలుసు. బహుశ తెల్లారుఝామున మూడు నాలుగు మధ్య దాడి జరగచ్చు. సెలీనా పదకొండు ఐదుకి కార్లోని రేడియోని ఆన్ చేసింది. హగ్ కంఠం కొద్దిసేపటికి ఆమెకి వినిపించింది.

'సెలీనా.. అంతా ఉగ్రవాదులు కోరినట్లే జరిగి మనం త్వరలో కలుసుకోవాలని జీసస్‌ని, అల్లాని ప్రార్ధిస్తూ నీకు ఈ రాత్రికి ఈ గుడ్ నైట్ కీర్తనని చెప్తున్నాను. విను.. గుడ్ నైట్ సెలీనా."

సెలీనా కళ్ళు మెరిసాయి. కార్లోని లైట్‌ని ఆన్ చేసి బైబిల్‌లోని కీర్తనల పేజీని తెరిచింది. తర్వాత చేతి గడియారం వంక చూసుకుంది.

తెల్లవారు ఝామున మూడుకి రేచెల్‌ని తట్టి లేపి చెప్పింది.

"మనల్ని రక్షించడానికి ఇంకాసేపట్లో కమాండో టీం వస్తుంది. మనం ఈ కేంప్‌కి ఎంత దూరంగా పారిపోతే అంత మంచిది. మీరో పని చేయాలి."

రాత్రి మూడు రెండుకి అకస్మాత్తుగా కారులోంచి రేచెల్ అరుపులు విన్న అబ్దుల్ చలిమంట ముందునించి  ఆమె వైపు పరిగెత్తుకు వచ్చాడు.

"స్టెయిన్ హెల్ప్."

"ఏమిటి?" అతను అడిగాడు.

"ఈ వత్తిడికి రేచెల్‌కి చెస్ట్ పెయిన్ వచ్చింది. ఆవిడ కూడా హృద్రోగి. అర్జెంట్‌గా సెనెటర్ని తీసుకురా. ఎమర్జన్సీ మాత్రలు ఆయన దగ్గర ఉన్నాయి."

అబ్దుల్ గుడారంలోకి పరిగెత్తుకెళ్ళి ఆ సమాచారాన్ని హసన్‌కి చెప్పాడు. ఆయన్ని తీసుకుని కారు దగ్గరకి తీసుకురాగనే సెలీనా అరిచింది.

"మీరు ముందు కారెక్కి మీ ఆవిడకి మాత్రలు ఇవ్వండి."

ఆయన ఎక్కి కూర్చోగానే రేచెల్ తలుపు మూసి భర్తని సీట్ల మధ్యకి తోసింది.

"ఏమిటిదంతా?" ఆయన అడిగాడు.

అకస్మాత్తుగా అన్ని వైపులనించీ స్పాట్ లైట్లు ఆ గుడారాల మీద పడ్డాయి. రహీం, అబ్దుల్, హసన్ చేతిలో తుపాకీలతో గిరుక్కున వెనక్కి తిరిగారు. వాళ్ళ కళ్ళ మీద లైట్ పడటంతో తాత్కాలికంగా గుడ్డివాళ్ళు అయ్యారు.

"మీ ఆయుధాలని కింద పడేయండి. మిమ్మల్ని చుట్టుముట్టాం" స్పీకర్లోంచి ఓ కంఠం అరబిక్‌లో వినిపిమిచింది.

హసన్ ఆ దీపం వైపు కాల్చాడు. తక్షణం అవతలివైపు పేలుడు వినిపించి అతని చేతిలోని స్టెన్ గన్ కిందపడింది. అతను తూలి నిలదొక్కుకున్నాడు. అబ్దుల్, రహీంలు చేతిలోని తుపాకీలని కింద పడేసి చేతులు ఎత్తారు.

కార్లోంచి కిందకిదిగిన ఆ ముగ్గురి దగ్గరకి వచ్చిన కమాండర్ అడిగాడు.

"సెనెటర్ స్టెయిన్. నేను ఈ యూనిట్ చీఫ్‌ని. మీ ముగ్గురూ కులాసా అనుకుంటాను?"

"కులాసా. ఇది అద్వితీయమైన దాడి" స్టెయిన్ చెప్పాడు.

"స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్. మీ కోసం పది నిమిషాల్లో ఓ హెలికాప్టర్ వస్తుంది."

కమాండర్ వెనకనించి వచ్చిన హగ్ సెలీనాని కౌగలించుకున్నాడు. ముప్పై ఆరుగంటల మానసిక భీతి తర్వాత కూడా ఆమె నిబ్బరంగా ఉంది.

హెలికాప్టర్‌లో వెళ్తూండగా రేచెల్ అడిగింది.

"మేము ఎక్కడ ఉన్నామో మీరు ఎలా కనుక్కున్నారు?"

"సెలీనా చెప్పింది" హగ్ జవాబు చెప్పాడూ.

"నిజమా?" ఆవిడ ఆశ్చర్యపోయింది.

"ఔను. నిజానికి అందుకు మీరు సహాయం చేసారు కూడా" సెలీనా నవ్వుతూ చెప్పింది.

"నేనా? ఏం సహాయం చేసాను?" రేచెల్ తెల్లబోయింది.

"నేను ఈ కేంప్‌కి డ్రైవ్ చేసేప్పుడు మైలేజ్ ఆడోమీటర్ని చూసి మార్గాన్ని గుర్తుంచుకున్నాను. దక్షిణం వైపు పదకొండు కిలోమీటర్లు వెళ్ళాక పశ్చిమం వైపు నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాం. రేడియోలో నేను చదివిన కీర్తన నంబర్ పదకొండు, పాదం నాలుగు."

"సెలీనా నాకు నిత్యం ఉదయం ఓ కీర్తన చెప్పడం నిజం కాదు. అది క్లూ అని ఇట్టే గ్రహించాను. ఈ నంబర్ ప్రకారం మేప్‌లో చూస్తే రెండు రోడ్లు కనిపించడంతో మీరు ఎక్కడ ఉన్నారో బోధపడింది" హగ్ చెప్పాడు.

"హగ్ చెప్పిన కీర్తన నంబర్ని బైబిల్‌లో చూస్తే అది కీర్తన మూడు, పాదం నాలుగు తెల్లారు ఝామున మూడు గంటల నాలుగు నిమిషాలకి మనల్ని రక్షించడానికి వస్తారని చెప్పాడని గ్రహించి ఆ సమయంలో ఉగ్రవాదుల గుళ్ళకి దూరంగా మనం కార్లో దాక్కున్నాం. మిగిలిన పని కమాండోలు చేసారు" సెలీనా ఆనందంగా చెప్పింది.

కొద్ది నిమిషాల తర్వాత హెలికాప్టర్ జెరూసలెంలో భద్రంగా దిగింది.

(వచ్చేనెల మరో కథ)

Post your comments